క్లుప్తంగా

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

మడికొండ: కొద్ది రోజులుగా హనుమకొండ, వరంగల్ పరిసర ప్రాంతాల్లో అంతర్‌రాష్ట్ర దొంగలు చాలా ఇళ్లలో దొంగతనం చేస్తున్నట్లు సమాచారం. ఇంట్లో మనుషులు ఉన్న వాళ్లను కొట్టి బంగారం, నగదు దోచుకుంటున్నారు. ఊరికి చివరిగా ఒంటరిగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని మడికొండ సీఐ కిషన్ తెలిపారు. ఆదివారం రాత్రి అమ్మవారిపేట వద్ద లారీ డ్రైవర్‌ను కొట్టి మొబైల్ లాక్కున్నారని, మన చుట్టుపక్కల వచ్చే ప్రమాదం ఉందన్నారు. మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు 8712685123, 8712685009, 8712685248కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

డీజే, సినిమా పాటలు నిషేధించాలి



రామన్నపేట : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే అమ్మవారి మండపాల వద్ద డీజే, సినిమా పాటలు నిషేధించేలా చర్యలు తీసుకోవాలని భారతీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కోట శివరామకృష్ణ కోరారు. ఈ మేరకు పరిషత్ వరంగల్ జిల్లా నాయకులతో కలిసి ఏఎస్పీ శుభమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజే, సినిమా, అశ్లీల పాటలు పెట్టే నిర్వాహకుల పై కేసులు నమోదు చేయాలని కోరారు.వినతిపత్రం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డికేష్ వర్మ, సభ్యులు రమేష్, సునీల్, తదితరులు ఉన్నానరు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

కాజీపేట : పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ రావుల సదానందం (70) సోమవారం ఆకస్మికంగా మృతి చెందాడు. మాజీ మంత్రి తిరునగిరి హయగ్రీవాచారి శిష్యుడిగా కాంగ్రెస్‌లోకి వచ్చిన సదానందం.. రాజకీయాల్లో వెను దిరిగి చూడలేదు. కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేయడంతో కార్పొరేటర్‌గా గెలిచి పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర అయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవ రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, కార్పొరేటర్లు రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, సుంచు అశోక్ నివాళులర్పించారు.

జోసెఫ్‌కు నివాళి

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ యూనిట్ కార్యాలయంలో ఆఫీస్ అటెండెంట్‌గా పని చేస్తున్న జోసెఫ్ (74) అనారోగ్యంతో మృతి చెందినట్లు సోమవారం కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ అన్ని బ్రాంచీల కోఆర్డినేటర్ నాయిని సదానందం తెలిపారు. కేరళకు చెందిన జోసెఫ్ 40 ఏళ్ల నుంచి మజ్దూర్ యనియన్ ఆఫీస్ అటెండెంట్‌గా పని చేస్తున్నాడు. యూనియన్ మాజీ డివిజన్ ప్రెసిడెంట్ కె.యాదవరెడ్డి, రైల్వే సీసీఎస్ డైరెక్టర్, జనరల్ బ్రాంచీ సెక్రటరీ డాక్టర్ డి.శ్రీనివాస్‌యాదవ్, ఇంజనీరింగ్ బ్రాంచీ సెక్రటరీ ఇ.రాజేందర్, రైల్వే రిటైర్డ్ నాయకులు జోసెఫ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చంద్రమౌళికి అవార్డు



విద్యారణ్యపురి/హన్మకొండ అర్బన్: న్యూఢిల్లీలోని ఫ్రెండ్‌షిప్ ఫోరం సంస్థ హనుమకొండలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళికి ప్రతిష్టాత్మకమైన రాష్ట్రీయ ఉద్యోగి రతన్ అవార్డును (2025) ప్రదానం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో, ఉత్తమ సేవలను అందిస్తున్న వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తుంది. విద్యారంగం అకాడమిక్ పరంగా చంద్రమౌళి అందిస్తున్న సేవలకు, ఆ కళాశాలను ఉన్నతంగా తీర్చిదిద్దటంలో చేస్తున్న కృషికి రాష్ట్రీయ ఉద్యోగి రతన్ అవార్డును ప్రదానం చేసింది. సోమవారం కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి సురేష్‌బాబు, ఎం.అరుణ అభినందించారు.

రావణాసురుడి ప్రతిమలు దహనం చేయొద్దు

విద్యారణ్యపురి : దసరాను పురస్కరించుకొని రావణాసురుడి ప్రతిమలు దహనం చేయడాన్ని నిషేధించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, ఇతర బాధ్యులు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ గణేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. మాట్లాడుతూ.. రావణాసురుడు రాక్షసుడు కాదని, లంక అనే రాజ్యానికి ఒక రాజు అని తెలిపారు. ఆయన గొప్ప పరిపాలనాధక్షుడన్నారు. మన మూలవాసుల చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బీటీ రోడ్ల నిర్మాణ పనులకు గ్రహణం

- ఒకే పనికి రెండుసార్లు శంకుస్థాపనలు
- అయినా పూర్తికాని పనులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు, ప్రజలు



సింగరాజుపల్లిలో కంకరపోసి వదిలేసిన రోడ్డు

దామెర : బీటీ రోడ్లు నిర్మాణమైతే ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి రాకపోకలు సులభతరం అవుతాయని ప్రజలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఆనందపడ్డారు. కాని అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా ఏళ్లు గడిచినా నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన అనంతరం ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పటి వరకు పనులు పూర్తికాకపోవడంతో అసంపూర్తిగా ఉన్న రోడ్లతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రెండుసార్లు శంకుస్థాపనలు..

మండలంలోని సింగరాజుపల్లి గ్రామం నుంచి హసన్‌పర్తి మండలంలోని హరిశ్చంద్రనాయక్ తండా వరకు గల మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు మండలాలకు రవాణా మెరుగుపడుతుందని అప్పటి ప్రభుత్వం రూ.3.4 కోట్ల ఎస్టీఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేసింది. దీంతో రెండేళ్ల క్రితం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పనులకు శంకుస్థాన చేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఇదే రోడ్డు కోసం గతేడాది అక్టోబర్‌లో మరోసారి శంకుస్థాపన చేశారు. అనంతరం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి కంకరపోసి వదిలేశాడు. నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పనులు పూర్తికావడంలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

'కుడా' నిధులు మంజూరైనా..

మండలంలోని తక్కళ్లపహాడ్ నుంచి సీతారాంపూర్‌కు వెళ్లాలంటే ఒగ్లాపూర్, ఊరుగొండ, దుర్గంపేట్ మీదగా వెళ్లాల్సి వచ్చేది. దీంతో తక్కళ్లపహాడ్-సీతారాంపూర్ గ్రామాల నడుమ తాత్కాలిక రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని అధికారులు నిర్ణయించారు. గత ప్రభుత్వం ప్రతిపాదించగా రూ.86 లక్షల 'కుడా' నిధులు మంజూరు అయ్యాయి. అనంతరం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కంకర పోసి మధ్యలోనే పనులు నిలిపివేశాడు. రెండేళ్లు అయినా పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు బీటీ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టసారించి పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.



ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శంకస్థాపన చేసిన శిలాఫలకం

పనులు త్వరగా పూర్తిచేయాలి



సింగరాజుపల్లి–హరిశ్చంద్ర నాయక్ తండా, తక్కళ్లపహాడ్–సీతారాంపూర్ గ్రామాల నడుమ బీటీ రోడ్ల నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు అయ్యాయి. గతంలో ప్రారంభించిన పనులకే ప్రస్తుత ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి రెండోసారి శంకుస్థాపన చేశారు. అయినా పనులు పూర్తిచేయడం లేదు. ఇప్పటికైనా స్పందించి పనులు త్వరగా పూర్తిచేయాలి.

– ఎండీ. జాకిర్‌అలీ, మాజీ వైస్ ఎంపీపీ

ప్రజాధనాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్

- బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

శాయంపేట : ప్రజల సొమ్మును దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ముందుంజలో ఉన్నారని, అవినీతి దోపిడిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీకు చెందిన పలువురు నాయకులు భూ భకాసురులేనని అన్నారు. నియోజకవర్గంలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీల నాయకులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇర పార్టీలకు గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల మొగిలి, నాయకులు కోడెపాక స్వరూప, భూతం తిరుపతి, ఉప్పు రాజు, శ్రీకాంత్, సురేష్, రాజశేఖర్, సుమన్, మహేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటాం



ఆత్మకూరు : కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటామని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీప్రసాదరావు అన్నారు. మండలంలోని నీరుకుళ్ల, పెద్దాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆకర్షితులైన పలువురు బీజేపీలో చేరినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గట్టు వేణు గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు రాజు, రమేశ్, గోపాల్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లకు నిధులు మంజూరు చేయాలి



ఎంపీడీఓ ఫణిచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

శాయంపేట : సద్దుల బతుకమ్మ సంబురాల ఏర్పాట్లుకు నిధులు మంజూరు చేయాలని సోమవారం ఎంపీడీఓ ఫణిచంద్రకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. రెండేళ్లుగా సర్పంచ్‌లు లేకపోవడంతో తామే అప్పులు చేసి గ్రామ అభివృద్ధి పనులను నెట్టుకొస్తున్నామని అన్నారు. గతేడాది బతుకమ్మ సంబరాలకు ఖర్చు చేసిన డబ్బులు నేటికీ విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అప్పులు తీసుకొచ్చి బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు చేయలేమని, ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరారు. దసరా ఉత్సవాలకు తమను బాధ్యుల్ని చేయొద్దని కోరారు. వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి భరోసా

కమలాపూర్ : అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మనోధైర్యం కల్పించారు. కమలాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మాట్ల రాజు కొంతకాలంగా రెండు కిడ్నీలు పనిచేయకపోవడంతో డయాలిసిస్ చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం అతడి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో సమాచారం తెలుసుకున్నట్లు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. అవసరమైతే రాజుకు కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులను కోరారు. ఇందు కోసం తన వంతు సహాయం అందిస్తానని, అవసరమైతే ప్రభుత్వంతో మాట్లాడుతానని రాజుతో పాటు అతని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు

- సీఐ రంజిత్‌రావు



మాట్లాడుతున్న సీఐ రంజిత్ రావు

శాయంపేట : అక్రమంగా ఇసుక తరలింపునకు పాల్పడితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని సీఐ రంజిత్‌రావు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇసుక రవాణాపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇసుక తరలించే వాహనాలకు లైసెన్స్, ఇసుక కూపన్లు కలిగి ఉండాలని సూచించారు. ఇసుకను ఎక్కువ ధరకు ఇతరులకు విక్రయించొద్దని, నిబంధనలు పాటించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే ఇసుక తరలించాలని, అధికారులు సూచించిన ధరకు మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎస్సై పరమేశ్, ఎంపీఓ రంజిత్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, మండలంలోని ట్రాక్టర్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

విలేకరినంటూ బెదిరించిన వ్యక్తిపై కేసు

నడికూడ : విలేకరినంటూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు దామెర ఎస్సై కొంక అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొకొండ గ్రామానికి చెందిన మేకల చిరంజీవి ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మొరం పోయించి చదను చేయిస్తున్నాడు. ఈ క్రమంలో చుక్క సతీశ్ అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతూ.. చిరంజీవి మీ బిల్లులు చెల్లించడని, ఎగగొట్టడం ఖాయమని డ్రైవర్‌తో అన్నట్లు తెలిపారు. ఈ మేరకు సతీశ్‌ను పంచాయతీ కార్యాలయం వద్దకు పిలుపించారు. దీంతో ఆగ్రహానికి లోనైన సతీశ్ తాను విలేకరినని తనను పిలుపిస్తారా అంటూ దుర్భాషలాడుతూ చిరంజీవి, అతడి సోదరుడు శ్రీకాంత్‌పై దాడిచేసినట్లు తెలిపారు. బాధితుడు చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

శాయంపేట : పరకాల నుంచి వెల్లంపల్లి, పోచారం నుంచి మండలంలోని గట్లకానిపర్తి, మాందారిపేట, శాయంపేట మీదుగా నర్సంపేటకు బస్సు సౌకర్యం కల్పించాలని గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పరకాల నుంచి గట్లకానిపర్తి మీదుగా నర్సంపేట బస్సు సౌకర్యం కల్పించడం వల్ల 7 గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని వినతిలో తెలిపారు. దీంతో పరకాల డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

మల, మూత్ర విసర్జనను నిర్మూలించాలి

మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో మల, మూత్ర విసర్జనను నిర్మూలించాలని కోరుతూ గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. చెరువు కట్ట వద్ద ఆడపడుచులు బతుకమ్మ ఆడుకొనే పవిత్ర ప్రదేశంలో బహిరంగ మల, మూత్ర విసర్జన చేయొద్దని సూచించారు.

లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు : మండలంలోని నాగయ్యపల్లిలో వివిధ సంక్షేమ పథకాలకు అర్హుల జాబితాలో అవకతవకలు జరిగాయని డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్ ఆరోపించారు. ఎంపిక ప్రక్రియను పునఃపరిశీలించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హుల ఎంపికలో కాంగ్రెస్ నాయకులకే ప్రాధాన్యమిచ్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రవి, మండల అధ్యక్షుడు రజనీకాంత్, నాయకులు సలీం, సుధాకర్, రాజశేఖర్, సరిత, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సురేష్, పాల్గొన్నారు.

బ్రిడ్జిపై లారీ బ్రేక్ డౌన్

1.45గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం



ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

హసన్‌పర్తి: వరంగల్ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న క్రమంలో ఎల్లాపురం బ్రిడ్జిపై ఎక్కుతుండగా సాంకేతిక లోపంతో లారీ నిలిచిపోయింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే స్తంభించాయి. సాయంత్రం 5 నుంచి 6.45 గంటల వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

దారి మళ్లింపు

కరీంనగర్ నుంచి హనుమకొండ వైపునకు వచ్చే వాహనాలు అన్నాసాగరం, జయగిరి మీదుగా మళ్లించారు. హనుమకొండ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్లే వాహనాలు కూడా మరో మార్గం నుంచి తమ గమ్యస్థానాలకు వెళ్లాయి.

దొంగలున్నారు జాగ్రత్త..

- ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ




అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : దొంగలు, అనుమానిత వ్యక్తుల సంచారంపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో అంతర్‌రాష్ట్ర దొంగలు, అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు ప్రజలను అప్రమత్తం చేసేందుకు పోలీసు సిబ్బందితో కలిసి మండలంలోని సోమవారం మైక్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. అంతర్‌రాష్ట్ర దొంగలు, అనుమానిత వ్యక్తులు తాళం వేసిఉన్న ఇళ్లు, ఒంటరిగా నివసిస్తున్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దసరా పండుగ సందర్భంగా ఇళ్లకు తాళం వేసి పొరుగూరికి వెళ్లాల్సి వస్తే చుట్టుపక్కలవారిని సమాచారం ఇవ్వాలని, నగదు, బంగారు ఆభరణాలు ఇతర విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో దాచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం



కమలాపూర్ : మండపంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించిన నిర్వాహకులు



ఎల్కతుర్తి : బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమించిన భద్రకాళి అమ్మవారు

కమలాపూర్ : కమలాపూర్, ఉప్పల్, మర్రిపల్లిగూడెం, గూడూరు, దేశరాజుపల్లి, శనిగరం, గుండేడుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత శరన్నవరాత్రోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను నిర్వాహకులు, భక్తులు ఊరేగింపుగా తీసుకెళ్లి మండపాల్లో ప్రతిష్ఠించారు. నవరాత్రుల పాటు అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి భక్తులతో కలిసి నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నవరాత్రుల అనంతరం దసరాతో దుర్గామాత నిమజ్జనంతో శరన్నవరాత్రోత్సవాలు ముగియనున్నాయి.

బాలాత్రిపుర సుందరి అలంకరణలో..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శ్రీభద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భద్రకాళి అమ్మవారిని బాలాత్రిపుర సుందరి రూపంలో అర్చకులు అలంకరించారు. ముందుగా వీరభద్రుడికి అభిషేకం నిర్వహించిన అర్చకులు కలశ స్థాపన, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, చతుషష్టి సహిత లలిత సహస్రనామ పారాయణం, చతుర్వేద పారాయణం నిర్వహించారు. ఆలయ ఈఓ కిషన్‌రావు, అర్చకులు రాజయ్య, రాంబాబు, వినయ్‌శర్మ, సందీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎల్కతుర్తి : మందులు పంపిణీచేస్తున్న రెహమాన్

ఎల్కతుర్తి : విషజ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వంగర ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ రెహమాన్ సూచించారు. సోమవారం భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామంలోని కాష కాలనీలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. డెంగీ, మలేరియా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తి గత పరిశుభ్రత, పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామంలో డ్రైడే నిర్వహించారు. సిబ్బంది మోహన్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి / నడికూడ : మహిళల ఆరోగ్య పరిరక్షణకే 'స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్'ను ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎల్కతుర్తి పీహెచ్‌సీ డాక్టర్ హారిక, నడికూడలోని రాయపర్తి పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక అన్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎల్కతుర్తి భీమదేవరపల్లి మండలం ములకనూరులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, నడికూడ మండలంలోని రాయపర్తిలో మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు వివిధ రకాల స్కానింగ్, ఇతర వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు ప్రదీప్‌రెడ్డి, మౌనిక, సిబ్బంది చక్రధర్, రాజయ్య, జ్యోతి పాల్గొన్నారు.

సమ్మక్క జాతర స్థలాన్ని కాపాడాలని వినతి



తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అశోక్

కమలాపూర్ : మండల కేంద్రంలోని సమ్మక్క గుట్ట వద్ద గల సమ్మక్క–సారలమ్మ జాతర స్థలాన్ని కాపాడాలని జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ ఆన్‌కార్ అశోక్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని సమ్మక్క గుట్ట వద్ద పట్టాదారు ఏవీ శరత్ కుమార్ జాతర నిర్వహణ కోసం సర్వే720లో 20 ఎకరాల భూమి దానం చేసినట్లు తెలిపారు. 40 ఏళ్లుగా ప్రతి రెండేళ్లకోసారి సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహిస్తున్నామని, జాతరకు వచ్చే వేలాది మందికి భక్తుల సౌకర్యార్థం గద్దెల చుట్టూ 20 ఎకరాల్లో పచ్చని చెట్లు నాటామని, తాగునీటి కోసం వాటర్ ట్యాంక్ నిర్మించి పైప్‌లైన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు వేసి సీసీ రోడ్లు నిర్మించామని, బోర్‌వెల్స్, నీటి కుళాయిలు, కుండీలు ఏర్పాటు చేసి జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మక్క–సారలమ్మ జాతర భూమిపై కొందరు అక్రమార్కులు కన్నేసి నకిలీ పత్రాలు సృష్టించి చెట్లను నరికి వేసి కొన్ని ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని, మరి కొందరు మట్టి అక్రమ వ్యాపారులు గుట్ట చుట్టూ మట్టి, మొరం తవ్వి సొమ్ముచేసుకుంటున్నారని తెలిపారు. గుట్ట చుట్టూ భూమిని కొలిచి హద్దులు ఏర్పాటు చేసి భూ ఆక్రమణదారులు, మట్టి, మొరం వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని జాతర భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రాజు, భిక్షపతి, మహేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఎంపీడీఓ విమల



పోషణ మాసోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నడికూడ : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ విమల అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–1లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతిరోజు భోజనంలో ఆకు కూరలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ విద్యావతి, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు హేమలత, శ్రీదేవి, ప్రాజెక్ట్ అధికారి భిక్షపతి, టీచర్లు సంపూర్ణ, అనిత, కళావతి, వినోద, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.